క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం



బయ్యారం: మండలంలోని వెంకట్రాంపురం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిమిత్తం అల్పాహారం కార్యక్రమాన్ని హెచ్ఎం లింగరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పదవీబాధ్యతలు ముగిసిన సర్పంచ్ బాణోత్ నీలమ్మరాము నాయక్, ఎస్ఎంసీ మాజీ అధ్యక్షుడు రాజును సన్మానించారు. ఉపాధ్యాయులు వీరన్న, వెంకటేశ్వర్లు, రమేష్, భావ్‌సింగ్, మహేందర్, వీరన్న, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు



బోడ లక్ష్మి



బొడ్డు లలిత

గూడూరు: మద్యం మత్తులో ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ యువకుడు ముందు వెళ్తున్న ట్రాలీ ఆటోను ఢీకొట్టడంతో అందులోని ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం రాత్రి జరిగినట్లు పోలీసులు తెలిపారు. గ్రామ పంచాయతీలో సిబ్బందిగా పనిచేస్తున్న బోడ లక్ష్మి, బొడ్డు లలితతోపాటు మరికొందరు మానుకోటలో ఫంక్షన్‌కు వెళ్లి, రాత్రి ట్రాలీ ఆటోలో తిరిగి వస్తున్నారు. రాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు ఆటో చేరుకోగా, వెనకాల ద్విచక్రవాహనంపై అతివేగంతో వచ్చిన యువకుడు ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఇరువురికి తీవ్రగాయాలు కాగా, ఢీకొట్టిన యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. గురువారం కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయాలి



మహబూబాబాద్ రూరల్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డిని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బలరాం నాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ టికెట్ ఆశిస్తున్న డాక్టర్ తేజావత్ బెల్లయ్యనాయక్, ఎట్టి వెంకన్న ఉన్నారు.

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు

కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు గోపతండా జీపీ పరిధిలోని హట్యా తండాకు చెందిన టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ మాలోత్ నెహ్రూనాయక్ గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గ టికెట్ ఆశించానని, టికెట్ రాకపోవడంతో పార్టీ ప్రకటించిన అభ్యర్థి విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. అధిష్టానం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట టికెట్ ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా.. కిసాన్ పరివార్ అధినేత ననావత్ భూపాల్‌నాయక్ సైతం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కురవి మండలం రాజోలు శివారు బాలు తండాకు చెందిన భూక్య బాలునాయక్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు.

సదస్సును విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 3న వరంగల్ హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో జరిగే విభజన హామీల అమలు సదస్సును విజయవంతం చేయాలని టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలు విస్మరించిన కేంద్ర ప్రభుత్వ అంశంపై తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సుకు తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, నాయకులు పిల్లి సుధాకర్, ఆరుద్ర పరమాత్మ చారి, ఇరుగు మనోజ్, ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: సర్పంచ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు



తొర్రూరు రూరల్‌లో..



కురవి: నేరడ సర్పంచ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు



సర్పంచుల సేవలు అభినందనీయం

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల సేవలు అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. గురువారంతో గ్రామపంచాయతీల పదవీ కాలం పూర్తి కావడంతో సర్పంచ్‌లు, పాలక వర్గానికి జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



గూడూరు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు



బీచ్‌రాజ్‌పల్లిలో..



నెల్లికుదురులో..



మహబూబాబాద్ రూరల్ :ముడుపుగల్‌లో..

రెక్కల పురుగు నివారణకు చర్యలు



వరి పంటను పరిశీలిస్తున్న సందీప్

దంతాలపల్లి: యాసంగి వరి పంటలో కాండం తొలిచే రెక్కల పురుగుల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ అన్నారు. మండలంలోని పెద్దముప్పారంలో రైతుల పంట పొలాలను గురువారం పరిశీలించి, మాట్లాడారు. పంట పొలాల్లో కాండం తొలిచే పురుగు ఉధృతిని గమినించినట్లు తెలిపారు. 15 రోజుల వయస్సు లేద పిలుక దశలో ఉన్న పంటపొలాల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10కేజీలు, లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కేజీలు, లేదా క్లోరంత నిలిప్రోలు గుళికలు ఎకరాకు 4కేజీలు ఇసుకలో కలిపి బురదపదునులో చల్లాలని సూచించారు. రైతులు రాజేశ్వర్‌రెడ్డి, కుమార్, ఐలయ్య, యాకుబ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఎరుకల కులస్తులకు ఇవ్వాలి

గార్ల: మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఎరుకల కులస్తుడు ఏకలవ్య సంఘం రాష్ట్ర నాయకుడు రాయపురం సాంబయ్యకు ఇవ్వాలని ఏకలవ్య సంఘం జిల్లా నాయకుడు మొగిలి వెంకన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. గురువారం గార్లలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నీతి, నిజాయితీగా మాట మీద ఉండే ఎరుకల కులస్తులకు కాంగ్రెస్ పార్టీ నేటి వరకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీటు కేటాయించకపోవడం విచారకరం అన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు కోనేటి నరసింహారావు, లాలయ్య, రమణయ్య, రాంబాబు, సీతారాం, రమేష్, వీరన్న, నాగులు పాల్గొన్నారు.

ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్ : మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఈ నెల 3,4తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం ప్రసాదరావు, పీఈటీ సమ్మెట ప్రేంకుమార్ గురువారం తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు కల్యాణి, మమత, షర్మిల, అంజలి, భవాని, మౌనిక, నవ్యశ్రీ, శ్రావణి జనవరి 28వ తేదీన మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడల ఎంపిక పోటీల్లో పాల్గొని ఉతమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. సర్పంచ్ పరకాల వెంకన్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లావణ్య, మోహన్, వెంకన్న, హరీష్, సురేష్, షేక్‌అలీ పాల్గొన్నారు.

దంతాలపల్లి: దాట్ల జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థి హరీశ్ జాతీయ స్థాయి గట్కా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన యుద్ధకళలో ఒకటైన గట్కా క్రీడను రాష్ట్రస్థాయిలో గత నెల 30న తొర్రూర్ పట్టణం నిర్వహించగా హరీశ్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు గుర్తుచేశారు. ఈ నెల 4నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గ్ పట్టణంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

మరిపెడ రూరల్: బీచ్‌రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ శివారు జర్పులతండాకు చెందిన పలు కుటుంబాలు బుధవారం కాంగ్రెస్‌లో చేరగా, మరో 10 బంజార కుటుంబాలు పార్టీ నాయకులు జర్పుల ఉపేందర్, జర్పుల రమేష్‌ల ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. చేరినవారిలో కేవుల, ఉపేందర్, వెంకన్న, శ్రీను ఉన్నారు.

మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌నాయక్

మరిపెడ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా తాను బరిలో ఉంటానని, టికెట్ తనకే కేటాయించాలని భద్రాద్రికొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ నూనావత్ శంకర్ నాయక్ అన్నారు. మరిపెడ మండల కేంద్రంలోని అతిథిగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించినట్లు తెలిపారు. గతంలో పినపాక నుంచి టీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి 32వేల ఓట్లు సాధించినట్లు గుర్తుచేశారు. 2017లో కాంగ్రెస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సింగరేణి కార్మిక నాయకుడు వాజీద్ ఉన్నారు.

నియామకాలు



భూక్యా విజయ

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ అనుబంధ మహిళా విభాగం మహబూబాబాద్ బ్లాక్ అధ్యక్షురాలిగా భూక్యా విజయను నియమించినట్లు జిల్లా మహిళా అధ్యక్షురాలు నూనావత్ రాధ గురువారం తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా కళావతి



కళావతి

గార్ల: జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పోచారం గ్రామానికి చెందిన చౌటపు కళావతిని నియమిస్తూ గురువారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు జె భరత్‌చంద్రారెడ్డి నియామకపు ఉత్తర్వులు అందజేశారు.

ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శిగా రాంబాబు



నియామక పత్రం అందజేస్తున్న భరత్ చందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా రాగం రాంబాబును నియమించినట్లు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవి నాయక్ గురువారం తెలిపారు.



దేవేందర్ నాయక్

మరిపెడ రూరల్: లంబాడీల ఐక్య వేదిక (లైవ్) మరిపెడ మండల కోర్డినేటర్‌గా మండలంలోని చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రూప్‌సింగ్ తండాకు చెందిన గుగులోతు దేవేందర్ రెండో సారి నియామకమయ్యారు.

నూతన కమిటీ ఎన్నిక



భాస్కర్‌రావు
అధ్యక్షుడు



కృష్ణాకర్‌రెడ్డి
ప్రధాన కార్యదర్శి

కురవి: సీరోలు మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు గురువారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా వి.భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జె.కృష్ణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా డీఎస్ శ్రీనివాస్, ఎ.శాంతకుమారి, కోశాధికారిగా ఎం.లక్ష్మీనర్సయ్య, కార్యదర్శులుగా ఎస్‌కె నూర్జహాన్, ఎ.రమ్య, ఎస్.శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా డి.విక్టోరియా, సభ్యులుగా ఎస్‌కె జీనత్, ఎఫ్‌డబ్ల్యూఫ్ కన్వీనర్‌గా బి.హచ్యానాయక్‌లు ఎన్నికైనట్లు ఆయన వివరించారు.

జీపీ కార్మికుడి మృతి

మహబూబాబాద్ రూరల్ : గుండెపోటుతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం మహబూబాబాద్ మండలంలోని వీఎస్. లక్ష్మీపురంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సురుగు వెంకన్న(55) గత 30 సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా, పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధులు భాగంగా గురువారం జీపీ వద్ద పనులు చేస్తుండగా సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమితం జనరల్ ఆస్పత్రికి తలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. వెంకన్నకు భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఆనంద్, ప్రసాద్, కుమార్తె రమాదేవి ఉన్నారు. వెంకన్న మృతిపై సర్పంచ్ పరకాల వెంకన్న, ఎంపీటీసీ తోట యాకాంబ్రం సంతాపం తెలిపారు.

కురుమలు ఐక్యంగా ఉండాలి

- ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఐలయ్య



ఐలయ్య, మురళీనాయక్‌కు సత్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: కురుమ కులస్తులు ఐక్యమత్యంతో ఉంటూ హక్కులను సాధించుకోవాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. జిల్లా కురుమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కురమలు రాజకీయ, విద్య, సామాజిక రంగాల్లో రాణించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గొర్లకు బదులుగా నగదు బదిలీ చేపట్టేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. కురుమల అభివృద్ధికి పాటుపడతానని, కమ్యూనిటీహాల్‌కు సహకరిస్తానని తెలిపారు. అనంతరం బీర్ల ఐలయ్య, మురళీనాయక్‌ను కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో చీర అశోక్, చెవేళ్ల సంపత్, చీర భిక్షపతి, దూడ నరేష్, బుచ్చన్న, చిట్టి వెంకన్న, శ్రీనివాస్, యాదగిరి, ప్రభాకర్ పాల్గొన్నారు.

కమిటీల పేరుతో కేంద్రం కాలయాపన



మాట్లాడుతున్న కొండ్ర ఎల్లయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా కమిటీల పేరుతో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర ఎల్లయ్య విమర్శించారు. జిల్లా కేంద్రంలో సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎల్లేందర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. చివరి పార్లమెంట్ సమావేశాల్లోనైన బిల్లు ఆమోదించి బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. బిల్లు తెస్తున్నాం ఆమోదిస్తున్నాం అంటూ హామీలు ఇస్తూ మాదిగ జాతిని మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. వర్గీకరణ బిల్లు కోసం ఈ నెల 5, 6 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పులి శ్రీను, సందీప్, రాధా, చారి, లత, జయ, రజిత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బాతులవ్యాన్!



పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న డీసీఎం వ్యాన్

- నీరు, ఆహారం లేక బాతుల మృత్యువాత
- దుర్వాసన వెదజల్లుతున్న వైనం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ టౌన్ పోలీసులు ఓ రోడ్డు ప్రమాదం కేసులో బాతుల వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్ ఎదుట నిలిపి ఉంచారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. వాహనంలోని బాతులకు నీరు, ఆహారం లేకపోవడంతో ఆకలికి అలమటించి మృత్యువాత పడుతున్నాయి.. దీంతో పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, బ్యాంకులకు వచ్చేవారు దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. నాలుగు రోజుల నుంచి ఆకలితో చనిపోతున్న బాతులను బతికించే ప్రయత్నం చేయడంతోపాటు, దుర్వాసన సమస్యను పరిష్కరించాలని అటుగా వెళ్లే ప్రతిఒక్కరూ కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి గాయాలు

కొత్తగూడ: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలైన ఘటన మండలకేంద్రం సమీపంలోని గాదెవాగు వద్ద గురువారం జరిగింది. గంగారం మండలం కామారం శివారు బర్లమల్లయ్యగుంపు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీరాలాల్ నర్సంపేట నుంచి పాఠశాలకు తన ద్విచక్రవాహనం పై వెళ్తున్నాడు. గాదెవాగు సమీప అటవీ ప్రాంతం నుంచి అడవి పంది ఒక్కసారిగా వచ్చి వాహనానికి తగిలింది. దీంతో వీరులాల్ కింద పడి తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నర్సంపేటకు తరలించారు.

సంక్షిప్త సమాచారం

మతతత్వ విధానాలు ప్రతిఘటిద్దాం

కేసముద్రం: ప్రధాని మోదీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామని ఐఎఫ్‌టీయూ నాయకుడు శివారపు శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 8న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరుగే ఆలిండియా వర్కర్స్ రిసెప్షన్ డే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. వెంకన్న, రాజు, అనిల్, సంజీవ, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

వినతి

మహబూబాబాద్ రూరల్ : దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఈ నెల 16వ తేదీన బందుకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ బంద్ చేయాలని కోరుతూ సీపీఎం అనుబంధ హమాలి సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న గురువారం వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ షంషీర్, సూపర్ వైజర్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆలయ హుండీ చోరీ

గార్ల: వడ్లఅమృత్‌తండా గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి హుండీని పగులగొట్టి సుమారు రూ.10,000 నగదు అపహరించినట్లు ఎస్సై జీనత్ కుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని గురువారం పోలీసులు సందర్శించారు. గ్రామపెద్ద బానోత్ గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

పెద్దవంగర: గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రచ్చ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాము గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఝాన్సీ, సోమయ్య, ఆనంద్, శ్యామ్, భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

బయ్యారం: మండలంలో బీజేపీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచలి వెంకటేశ్వరరావు అన్నారు.

ఉప్పలపాడులో గురువారం దివంగత బీజేపీ నాయకుడు రాసాల లింగయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. యాప సీతయ్య, రాసాల నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆటంకం కలగొద్దు

దంతాలపల్లి: గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలుగకుండా చూడాలని తహసీల్దార్ తేల్ల శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేక అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు చేశారు. మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఎంపీఓ అప్సర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వర్సటైల్ విద్యార్థుల క్షేత్ర సందర్శన

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని వర్సటైల్ పాఠశాల విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా మండలంలోని పర్వతగిరి గ్రామాన్ని గురువారం సందర్శించారు. వరి నాటు వేసే విధానం, దున్నడం, విత్తనాలు చల్లడం, బురద పొలాన్ని ఎలా చదును చేయాలనే అంశాలపై విద్యార్థులు రైతులను అడిగి తెలుసుకున్నారు.

సర్వేకు సహకరించాలి

మహబూబాబాద్: నల్లాల వివరాలు, పన్ను విధింపు మొదలగు వివరాల సేకరణకు మున్సిపల్ సిబ్బంది ఈనెల 2వ తేది నుంచి సర్వే చేస్తారని ఆ సర్వేకు సహకరించాలని కమిషనర్ ప్రసన్నరాణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. నల్లా కనెక్షన్లకు సంబంధించిన వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్ ఇచ్చి సహకరించాలని తెలిపారు. పట్టణంలో ఇంటింటికీ భగీరథ నీటి సరఫరా జరుగుతుందా లేదా.. డబుల్ నల్లాలు, వృథాగా వినియోగించుకున్న నల్లాల వివరాలు, పన్ను విధింపు మొదలగు వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఆస్తి, నల్లా పన్నుల బకాయిలు చెల్లించాలని తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి ధరించాలి

దంతాలపల్లి: బైకు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్సై రమేష్‌బాబు అన్నారు. రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని ఖమ్మం -వరంగల్ జాతీయ రహదారిపై వాహనదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

సమ్మెకు కార్మికవర్గం కదిలిరావాలి

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు కార్మికవర్గం కదిలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కార్మికవర్గానికి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. సమావేశంలో కుంట ఉపేందర్, నూనె శ్రీనివాస్, పులిపాక నాగరాజు, అంబాల శ్రీనివాస్, రాయకంటి సాంబమూర్తి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దంతాలపల్లి: తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఎస్సై రమేష్‌బాబు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్న రామన్న, అంతయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు వీరే..

కొత్తగూడ: సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండలంలోని గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. పొగుళ్లపల్లి, మొండ్రాయిగూడెం గ్రామాలకు ఐబీ ఏఈ అనూష, సాదిరెడ్డిపల్లి, కోనాపూర్, ఎంచగూడెం గ్రామాలకు మిషన్ భగీరథ ఏఈ నరేష్, గుండం హెచ్ఎం విష్ణువర్ధన్, ఎదుళ్లపల్లి, గోవిందాపూర్, పెగడపల్లి గ్రామాలకు ఏఓ ఉదయ్, బత్తులపల్లి, గోపాలపూర్, తాటివారివేంపల్లి గ్రామాలకు తహసీల్దార్ రమాదేవి, కొత్తగూడ, గుంజేడు గ్రామాలకు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, జంగవానిగూడేనికి హెచ్ఎం సక్రు, ఓటాయి, రేణ్యతండాలకు వాటర్‌గ్రిడ్ ఏఈ శివ, ముస్మి, రామన్నగూడెం, దుర్గారానికి ఎంపీఈఓ పద్మ, కార్లాయి కి ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ హేమంత్, కొత్తపల్లికి మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, వేలుబెల్లి, చెరువుముందుతండాలకు ఏటీడీఓ భాస్కర్‌లను కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామ శివారు పాలకేంద్రం సమీపంలో గురువారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సందర్భంగా ఎస్సై జగదీష్ మాట్లాడుతూ.. సుమారు 60 సంవత్సరాలకు పైబడి ఉన్న ఓ వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెంది ఉన్నాడని, మృతదేహాన్ని తొర్రూరు పట్టణంలో పోస్టుమార్టం ఆస్పత్రిలో ఉంచామని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 56982 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.